# పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య

• కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

**కోవూరు:** రాష్ట్రంలో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలనే ధృడ సంకల్పంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు–నేడుతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుస్తున్నారని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. పోతిరెడ్డిపాళెంలోని గుంటకట్ట ప్రభుత్వ పాఠశాలలో నాడు–నేడు కింద రూ.24 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం సీసీరోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా పోతిరెడ్డిపాళెంలో పర్యటించగా సీసీరోడ్లు నిర్మించాలని ప్రజలు విజ్ఞప్తి చేశారన్నారు. రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య ఎంపీ నిధులు రూ.15లక్షలతో పోతిరెడ్డిపాళెంలో సీసీరోడ్లను నిర్మించనున్నట్లు తెలిపారు. రూ.50లక్షలతో డ్రైనేజీలను నిర్మిస్తామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీపడకుండా గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా గుర్తించిన సమస్యల పరిష్కారానికి చర్యలు ప్రతిసచివాలయానికి నిధులు కేటాయిస్తున్నారని తెలిపారు. పొదుపు సభ్యుల ఆర్థికాభివృద్ధికి ఆసరా, సున్నవడ్డీ, జగనన్న చేయూత, తదితర పథకాలను అమలు చేస్తున్నారన్నారు. అందులో భాగంగానే పోతిరెడ్డిపాళెం సంఘ బంధానికి రూ.9 లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు. గ్రామంలోని పొదుపు సంఘాల సభ్యులు ఇప్పటి వరకు ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నారని, ఇకపై అలాంటి సమస్యలకు తావులేకుండా అన్నింటిని క్రమబద్ధీకరించడం జరిగిందన్నారు. డీఏఏబీ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నలుబోలు సుబ్బారెడ్డి, పడుగుపాడు సొసైటీ చైర్మన్ రామిరెడ్డి మల్లికార్జునరెడ్డి, ఎంపీపీ పార్వతి, జెడ్పీటీసీ శ్రీలత, హరిప్రసాద్‌రెడ్డి, డీఎల్‌డీఏ డైరెక్టర్ కాటంరెడ్డి దినేష్‌రెడ్డి, సర్పంచ్ నలుబోలు శ్రీవాణి, హైటెక్ ఫార్మా అధినేత వెంకటరమణారెడ్డి, స్థానిక నాయకులు మల్లికార్జున్, రాజా, మధు, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

## బీసీలను ఆదుకున్న ఘనత వైఎస్సార్‌సీపీదే


మాట్లాడుతున్న మల్లికార్జున్

**కోవూరు:** బీసీలకు రాజకీయంగా, ఆర్థికంగా చేయూతనిచ్చి ఆదుకున్న ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది ఒక్క వైఎస్సార్సీపీ ప్రభుత్వమేనని ఆ పార్టీ బీసీ సెల్ మండలాధ్యక్షుడు కేతా మల్లికార్జున పేర్కొన్నారు. కోవూరులోని వైఎస్సార్సీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల టీడీపీ నాయకులు చెముకుల చైతన్య, మాధవరెడ్డి పరస్పరం వ్యక్తిగత దూషణలు చేసుకోవడం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిపై చైతన్య అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు.చైతన్య నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బీసీలకు రాజకీయ పదవులు కల్పించగా, అణగదొక్కుతోందని మాట్లాడడం సిగ్గుచేటన్నారు. 2014లో పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి వెంట నడిచిన చైతన్యకు బీసీలు గుర్తు రాలేదన్నారు. 2017లో పాటూరులో బీసీకి చెందిన కార్యకర్త చిన్న ఫ్లెక్సీ విషయంలో పొరపాటు చేస్తే పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టి హింసించారని గుర్తుచేశారు. ఆనాడు గుర్తురాని బీసీలు ఈరోజు గుర్తొచ్చారాని ప్రశ్నించారు. వైఎస్సార్సీపీ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి తురకా భాస్కర్, అనుబంధ సంఘాల నాయకులు పన్నెం సుధ, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## ముత్తుకూరులో గడప గడపకూ మన ప్రభుత్వం నేడు

**ముత్తుకూరు:** ముత్తుకూరు పంచాయతీలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం సాయంత్రం నిర్వహించనున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ విష్ణువర్ధన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి హాజరై.. సంక్షేమ పథకాల అమలుపై ప్రజలతో చర్చించనున్నారని చెప్పారు.

## పంట నమోదును 25లోపు పూర్తి చేయాలి


పొదలకూరు: పంటను పరిశీలిస్తున్న సుధాకర్‌రాజు


కొడవలూరు: గండవరంలో

**పొదలకూరు:** పంటల నమోదు కార్యక్రమాన్ని ఈ నెల 25లోపు పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి సుధాకర్‌రాజు పేర్కొన్నారు. మండలంలోని తోడేరు, బిరదవోలు, మరుపూరు గ్రామాల్లో వరి పంటను బుధవారం ఆయన పరిశీలించారు. పంటల నమోదు తీరుతెన్నులను ఆరాతీసిన అనంతరం ఆయన మాట్లాడారు. వీఏఏ, వీహెచ్‌ఏలు రోజూ వందెకరాల మేర పంటలను నమోదు చేయాలని సూచించారు. ఎక్కడా విమర్శలు తలెత్తకుండా జాగ్రత్తలు పాటించి పంటలను నమోదు చేయాలని ఆదేశించారు. రబీలో వరి దిగుబడైన అనంతరం పౌరసరఫరాల శాఖకు ఈ – క్రాప్ వివరాలను అందించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. జిల్లాలో 15250 సీసీఆర్ కార్డులను పంపిణీ చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు 14660 మేర అందజేశామని వెల్లడించారు. అనంతరం వరిసాగులో యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. ఏడీఏలు నర్సోజీరావు, శివనాయక్, ఏఓ వాసు, తదితరులు పాల్గొన్నారు.

**కొడవలూరు:** మండలంలోని రైతులు ఈ నెల 25లోగా ఈక్రాప్ నమోదును చేసుకోవాలని ఏఓ సీహెచ్ఎస్ లక్ష్మి సూచించారు. మండలంలోని గండవరంలో ఈ క్రాప్ నమోదును బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ఈక్రాప్ నమోదుకు రైతులు సహకరించాలని కోరారు. వరి కోతలు సమీపించిన సమయంలో పంట నమోదు చేసుకోవచ్చనే ఉద్దేశంతో రైతులు ఆసక్తి చూపడం లేదన్నారు. ఆ సమయంలో రైతులందరూ ఒక్కసారిగా నమోదు చేసుకునేందుకు సమయం సరిపోదన్నారు. అందువల్ల రైతులు ఆర్‌బీకేల్లోని వీఏఏలను సంప్రదించి ముందుగా ఈక్రాప్ నమోదు చేసుకోవాలని కోరారు. ఏఓ వెంట వీఏఏ కవిత, రైతులు ఉన్నారు.

### వేడుకగా అభిషేకం



**పొదలకూరు:** పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో గల లక్ష్మీ గోదా సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో తొమ్మిది కలశాలతో స్వామి, అమ్మవార్లకు అభిషేకాలను బుధవారం నిర్వహించారు. పండ్లు, చక్కెర, తేనె, పుష్పాలతో అభిషేకించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య కార్యక్రమాలను నిర్వహించారు.

### మర్యాదపూర్వకంగా..



**బుచ్చిరెడ్డిపాళెం:** నెల్లూరులోని నివాసంలో ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డిని పట్టణ, రూరల్ సచివాలయ కన్వీనర్ల కమిటీ పర్యవేక్షణ కన్వీనర్లుగా ఎన్నికైన మోర్ల మురళీ, బిల్లా వినోద్‌కుమార్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేకు మొక్కను అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. వారి వెంట పార్టీ నాయకులు యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, బుచ్చిరెడ్డిపాళెం, కోవూరు మండలాల కన్వీనర్లు చెర్లో సతీష్‌రెడ్డి, నలుబోలు సుబ్బారెడ్డి ఉన్నారు.

### నేడు గడప గడపకు మన ప్రభుత్వం

**బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు):** మండలంలోని మత్స్యకార గ్రామమైన పెదపాళెంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటంరెడ్డి నవీన్‌కుమార్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు బెజవాడ గోవర్ధన్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఉదయం 7.30 గంటల నుంచి జరిగే కార్యక్రమంలో ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పాల్గొంటారని చెప్పారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించడంతో పాటు ప్రజల సమస్యలను తెలుసుకుంటారని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

### రూ.3.14 కోట్లతో విద్యుత్ ఆధునికీకరణ

**కోవూరు:** కోవూరు విద్యుత్ సబ్‌డివిజన్ పరిధిలో రూ.3.14 కోట్లతో విద్యుత్ ఆధునికరణ పనులు చేపట్టి విద్యుత్ సమస్యలను శాశ్వతంగా తొలగించేందుకు చర్యలు తీసుకున్నామని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. 53,400 మీటర్ల పొడవున ఎలక్ట్రికల్ వైర్లు బలోపేతం చేసేందుకు రూ.1.64 కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. కోవూరు, కోవూరు రూరల్, ఇనమడుగు సబ్‌స్టేషన్ పరిధిలో హై, లోఓల్టేజ్ సమస్యను అధిగమించేందుకు రూ.1.50 కోట్లతో 77 కొత్త అడిషనల్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

## హోరాహోరీగా క్రికెట్ పోటీలు


మనుబోలులో..


వెంకటాచలం: బహుమతుల ప్రదానం

**మనుబోలు:** స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న ఎస్సార్ క్రికెట్ టోర్నీ ఉత్కంఠభరితంగా సాగుతోంది. బుధవారం జరిగిన మ్యాచ్‌లలో బద్దెవోలు బ్లాస్టర్స్, సత్యా లెవన్ బద్దెవోలు, కట్టువపల్లి, శివాలయం జట్లు విజయం సాధించి ముందంజ వేశాయి. మొదటి మ్యాచ్‌లో బ్యాటింగ్ చేసిన సంగమేశ్వర లెవన్ జట్టు 45 పరుగులకే ఆలౌటైంది. లక్ష్యాన్ని ఛేదించి బద్దెవోలు బ్లాస్టర్స్ జట్టు విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో గురివిందపూడి జట్టుపై సత్యా లెవన్ బద్దెవోలు జట్టు, మూడో మ్యాచ్‌లో కొలనకుదురు జట్టుపై కట్టువపల్లి, నాలుగో మ్యాచ్‌లో మనుబోలు మెయిన్ జట్టుపై శివాలయం జట్టు విజయం సాధించాయి. కరిముల్లా, ప్రసన్న, వెంకటేష్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులను గెలుచుకున్నారు. క్వార్టర్ ఫైనల్స్‌ను గురువారం నుంచి నిర్వహించనున్నామని నిర్వాహకులు తెలిపారు.

**ముగిసిన పోటీలు**

**వెంకటాచలం:** సంక్రాంతిని పురస్కరించుకొని మండలంలోని తిక్కవరప్పాడులో నిర్వహించిన కాకాణి రమణారెడ్డి మెమోరియల్ క్రికెట్, వాలీబాల్ టోర్నీ బుధవారంతో ముగిసింది. పంచాయతీ పరిధిలోని అన్ని కాలనీల నుంచి యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. క్రికెట్, వాలీబాల్ పోటీల్లో విన్నర్స్, రన్నర్స్‌కు నగదు బహుమతులను నిర్వాహకులు వెంకటరమణయ్యయాదవ్ చేతుల మీదుగా అందజేశారు.

## ప్రమాదభరితంగా మలుపులు


అయ్యగారిపాళెం వద్ద ప్రమాదకరంగా మలుపు

**పొదలకూరు:** మండలంలోని పొదలకూరు – నావూరు మార్గంలో ప్రమాదకర మలుపులు పదుల సంఖ్యలో ఉన్నాయి. ఫలితంగా రోడ్డు ప్రమాదాలు తరచూ సంభవిస్తున్నాయి. మలుపుల వద్ద కంప తుమ్మ చెట్లు ఏపుగా పెరగడంతో ద్విచక్ర వాహనదారులకు ఇబ్బందిగా మారింది. హారన్ ఇవ్వకుండా మలుపు తిరిగేందుకు యత్నిస్తే ఎక్కడ ప్రమాదం జరుగుతుందోనని హడలిపోతున్నారు. అయ్యగారిపాళెం, నందివాయ, అమ్మవారిపాళెం, నావూరు వద్ద మలుపులు అధికంగా ఉన్నాయి. ఈ మార్గం మీదుగా కొత్తగా వెళ్లే వాహనచోదకులకు ప్రమాదకర మలుపులతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. సంబంధిత అధికారులు మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయించలేదు. గ్రామాల సమీపంలో ఆయా గ్రామస్తులు స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేసి ప్రమాదాలను కొంత మేర నివారిస్తున్నారు. మిగిలిన మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులను వెంటనే ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

## సీఐగా జీ రామారావు బాధ్యతల స్వీకరణ


నూతన సీఐ రామారావును అభినందిస్తున్న సీఐ కోటేశ్వరరావు

**బుచ్చిరెడ్డిపాళెం:** బుచ్చిరెడ్డిపాళెం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా జీ రామారావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా విధులు నిర్వహిస్తున్న చిట్టెం కోటేశ్వరరావు వీఆర్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో రామారావు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని బుచ్చిరెడ్డిపాళెం, కొడవలూరు, విడవలూరు మండలాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. బుచ్చిరెడ్డిపాళెంలో ట్రాఫిక్ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ప్రజల సహకారంతో మరింత బాధ్యతగా విధులు నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా నూతన సీఐ రామారావుకు బదిలీపై వెళ్తున్న సీఐ కోటేశ్వరరావు అభినందనలు తెలిపారు.

## సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు


వైద్యసిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం

**కొడవలూరు:** గ్రామాల్లో తరచూ పర్యటిస్తూ వైద్య సిబ్బంది సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ పీ సుబ్రహ్మణ్యం సూచించారు. మండలంలోని యల్లాయపాళెం పీహెచ్‌సీని బుధవారం ఆయన పరిశీలించారు. వైద్యసిబ్బందికి పలు సూచనలు చేశారు. ఓపీకి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. పీహెచ్‌సీ పరిధిలో ఎక్కువగా గ్రామాలు, ఎస్సీ, ఎస్టీ కాలనీలు ఉన్నందున రక్తహీనతను ఎదుర్కొంటున్న గర్భిణులను గుర్తించి వైద్యం అందించాలన్నారు. పీహెచ్‌సీలో ఇద్దరు మహిళా వైద్యులు అందుబాటులో ఉన్నందున కాన్పులు జరిగేలా చూడాలన్నారు. హెచ్‌డీఎఫ్ నిధులు సద్వినియోగం చేసుకుని హాస్పిటల్ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎంపీడీఓ వెంట వైద్యాధికారిణి కావ్య, వైద్య సిబ్బంది ఉన్నారు.

## ఉపాధి జాబ్‌కార్డులకు ఆధార్ సీడింగ్


మాట్లాడుతున్న ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం

**బుచ్చిరెడ్డిపాళెం:** ఉపాధి హామీ పథకం జాబ్ కార్డులకు ఆధార్ సీడింగ్ చేపట్టాలని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో బుధవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 15 పంచాయతీల్లో దాదాపు 13 వేల జాబ్‌కార్డులు ఉన్నాయని తెలిపారు. వాటికి కూలీల ఆధార్ నంబర్లను అనుసంధానం చేయాలని ఆదేశించారు. కూలీలకు పని దినాలు కల్పించాలన్నారు. అందుకు అవసరమైన పనులను గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈసీ సోఫియా, సిబ్బంది పాల్గొన్నారు.

# టీడీపీలో లుకలుకలు

**తోటపల్లిగూడూరు:** టీడీపీలో వర్గపోరు మరోసారి భగ్గుమంది. పార్టీ రాష్ట్ర కార్యదర్శి సురేంద్ర, పార్టీ మండలాధ్యక్షుడు సురేష్‌రెడ్డి మధ్య కొంతకాలంగా వర్గపోరు నడుస్తోంది. గతంలో పార్టీ మండలాధ్యక్షుడిగా ఉన్న సురేంద్రకు రాష్ట్ర కమిటీలో చోటు దక్కింది. దీంతో పార్టీ మండలాధ్యక్ష పదవి సురేష్‌రెడ్డికి మూడేళ్ల క్రితం దక్కింది. సురేంద్ర తర్వాత పార్టీలో సీనియర్ నేతలున్నా, బీజేపీలో కొనసాగుతున్న సురేష్‌రెడ్డిని పార్టీలోకి తీసుకోవడంతో పాటు ఏకంగా పార్టీ మండలాధ్యక్ష పదవిని కట్టబెట్టారు. కొద్ది కాలం బాగానే ఉన్నా వీరి మధ్య విభేదాలు మొదలయ్యాయి. దీంతో పార్టీ నేతలు రెండు వర్గాలుగా విడిపోయారు. ఈ క్రమంలో తోటపల్లిగూడూరులో బుధవారం నిర్వహించిన ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమంలో వీరి మధ్య విభేదాలు మరోసారి బట్టబయలయ్యాయి. మండలాధ్యక్షుడి ఆధ్వర్యంలో నిర్వహించాల్సిన వర్ధంతి కార్యక్రమాలను సురేంద్ర జరిపారు. రెండు నిమిషాల వ్యవధిలో అక్కడికి చేరుకున్న మండలాధ్యక్షుడు సురేష్‌రెడ్డి దీన్ని చూసి వెంటనే అలిగి అక్కడి నుంచి వెళ్లిపోయారు.

## పురుగుమందు తాగి ఆత్మహత్య


వెంకటరమణయ్య మృతదేహం

**కొడవలూరు:** పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ ఆర్టీసీ డ్రైవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై జి.సుబ్బారావు కథనం మేరకు.. కావలి ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పని చేసే మార్లెళ్ల వెంకటరమణయ్య (53) భార్యాపిల్లలతో కలిసి ముసునూరులో ఉండేవాడు. ఏడాది క్రితం భార్యతో విభేదించి కొడవలూరులోని బంధువుల వద్దకు చేరుకున్నాడు. అప్పటి నుంచి అక్కడే ఉంటూ కావలికి డ్యూటీకి వెళ్లి వస్తుండేవాడు. ఈక్రమంలో ఏం జరిగిందో కానీ కొడవలూరుకు సమీపంలోని టపాతోపు వద్ద ఉన్న శిథిల రొయ్యల ఫ్యాక్టరీ వద్ద మంగళవారం పురుగుమందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు చూసి అతడి బంధువులకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని వెంకటరమణయ్యను నార్తురాజుపాళెంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరులోని రామచంద్రారెడ్డి వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినట్లు ఎస్సై జి.సుబ్బారావు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### కమ్మేసిన పొగమంచు



**పొదలకూరు:** తెల్లవారితే పొగమంచు కమ్మేస్తోంది. కొన్ని సందర్భాల్లో మంచు సోయగాలు ఆహ్లాదకరంగా ఉంటాయి. పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో నిర్మాణంలో ఉన్న శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని పొగమంచు ఆలుముకోవడంతో దేవస్థానం ప్రాంతం ఆహ్లాదకరంగా మారింది.

## మాదక ద్రవ్యాలపై సమాచారం ఇవ్వండి


తహసీల్దార్ ఎదుట రామలింగయ్యను బైండోవర్ చేస్తున్న సెబ్ అధికారులు

**బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు):** విడవలూరు మండలంలో ఎక్కడైనా సారాయి, గంజాయి విక్రయాలు సాగిస్తుంటే ప్రభుత్వ టోల్‌ఫ్రీ నంబర్ 14500 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోవూరు సెబ్ ఎస్ఐ నరహరి కోరారు. సారా విక్రయ కేసులో పాతనేరస్థుడిగా ఉన్న వెంకటరెడ్డి పాళేనికి చెందిన రామలింగయ్యను విడవలూరు తహసీల్దార్ చంద్రశేఖర్ ఎదుట బుధవారం బైండోవర్ చేశారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు సారాయి, గంజాయి, తదితర మాదక ద్రవ్యాల కట్టడికి పాతనేరస్థులను బైండోవర్ చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట సెబ్ సిబ్బంది కే శ్రీనివాసులు, శ్రీనివాసులు ఉన్నారు.

## క్లుప్తంగా

### రైల్లో గంజాయి తరలించేందుకు యత్నం

**నెల్లూరు(క్రైమ్):** రైల్లో గంజాయిని తరలించేందుకు యత్నిస్తున్న వ్యక్తిని రైల్వే పోలీసులు అ రెస్ట్ చేసి.. నాలుగు కిలోల గంజాయిని స్వాధీ నం చేసుకున్నారు. నెల్లూరులోని తన కార్యాలయంలో నిందితుడి వివరాలను రైల్వే డీఎస్పీ మల్లికార్జునరావు బుధవారం వెల్లడించారు. విశాఖపట్నం జిల్లా జీ మాడుగుల మండలం వాకపల్లికి చెందిన మత్యలింగం ఒడిశా, తదితర ప్రాంతాల నుంచి ఇతర జిల్లాల వ్యాపారులకు కమీషన్ పద్ధతిపై గంజాయిని సరఫరా చేయసాగారు. ఇందులో భాగంగా హిందూపురానికి చెందిన భీమప్పకు నాలుగు కిలోల గంజాయిని ఇచ్చేందుకు విశాఖపట్నం నుంచి తిరుమల ఎక్స్‌ప్రెస్‌లో బయల్దేరారు. బుధవారం తెల్లవారుజామున గూడూరులో దిగి అక్కడి నుంచి ధర్మవరానికి టికెట్ తీసుకున్నారు. నేర నియంత్రణలో భాగంగా గూడూరు రైల్వే ఎస్సై కొండప్పనాయుడు తన సిబ్బందితో కలిసి ఫిన్స్ సాయంతో తనిఖీలు చేయసాగారు. విషయాన్ని గమనించిన మత్యలింగం పరారయ్యేందుకు యత్నించగా, ఎస్సై వెంటనే అతడ్ని అదుపులోకి తీసుకొని బ్యాగ్‌ను తనిఖీ చేశారు. అందులోని నాలుగు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడ్ని స్టేషన్‌కు తరలించి పూర్తి వివరాలను సేకరించిన అనంతరం అరెస్ట్ చేశారు. భీమప్పను సైతం అరెస్ట్ చేస్తామని డీఎస్పీ తెలిపారు. నేరాల కట్టడిలో భాగంగా రైళ్లు, రైల్వేస్టేషన్లలో తనిఖీలను ముమ్మరం చేశామని, ఇప్పటికే ప లువురు నేరస్తులను అరెస్ట్ చేశామని వివరించా రు. గంజాయిని స్వాధీనం చేసుకోవడంలో ప్ర తిభ చూపిన రైల్వే ఎస్సై, కానిస్టేబుళ్లు ప్రకాష్, వెంకటేశ్వర్లును డీఎస్పీ అభినందించారు. రైల్వే సీఐ శ్రీనివాసాచారి, తదితరులు పాల్గొన్నారు.

### రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

**నెల్లూరు(క్రైమ్):** గుర్తుతెలియని యువకుడు నెల్లూరు వైపు వెళ్లే హౌరా రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు సమీపంలో పట్టాలపై మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. మృతుడి వయసు 25 నుంచి 30 ఏళ్లలోపు ఉంటుందని రైల్వే పోలీసులు భావిస్తున్నారు. బ్లూ కలర్‌పై వైట్ కలర్ గళ్లున్న ఫుల్‌హ్యాండ్స్ చొక్కా, బ్లూ కలర్ ఫుల్‌హ్యాండ్స్ జర్కిన్, బ్లూ కలర్ జీన్స్ ప్యాంట్‌ను ధరించి ఉన్నారు. సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే ఎస్సై హరిచందన ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. అక్కడ ఎలాంటి వివరాలు లభ్యం కాలేదు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి ఎస్సై కేసు దర్యాప్తు చేపట్టారు. మృతుడి వివరాల కోసం ఘటన జరిగిన పరిసర ప్రాంతాల్లో ఆరాతీశారు.

### విద్యుత్ వైర్ల చోరీ

**నెల్లూరు(క్రైమ్):** నిర్మాణంలో ఉన్న టిడ్కో గృహాల్లోని విద్యుత్ వైర్లను గుర్తుతెలియని దుండగులు చోరీ చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరు రూరల్ మండలం అక్కచెరువుపాడు పరిధిలో టిడ్కో ఇళ్ల నిర్మాణ పనులను డీఈసీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ప్రాజెక్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగులు బ్లాక్ 45, 38 వద్ద నిర్మాణంలో ఉన్న ఇళ్ల తలుపులను బుధవారం తెల్లవారుజామున పగలగొట్టి అందులో ఉన్న రూ.లక్ష విలువజేసే విద్యుత్ వైర్లను అపహరించారు. గమనించిన వాచ్‌మెన్ వికాస్ అడ్డుకున్నారు. వారు అతడ్ని తోసేసి పరారయ్యారు. దీంతో కంపెనీ సీనియర్ ఇంజినీర్ సూర్యప్రకాష్‌కు ఫోన్లో ఆయన సమాచారం అందించారు. దీనిపై వేదాయపాళెం పోలీసులకు ఇంజినీర్ ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### చోరీపై ఫిర్యాదు

• వస్తువులు ఇంట్లోనే ఉండటంతో చర్యలొద్దని వినతి

**నెల్లూరు(క్రైమ్):** తన ఇంట్లో చోరీ జరిగిందని వేదాయపాళెం పోలీసులకు మహిళ ఫిర్యాదు చేశారు. చివరికి చోరీకి గురయ్యాయని భావించిన వస్తువులు ఇంట్లోనే ఉండటంతో ఫిర్యాదుపై చర్యలొద్దని పోలీసులను కోరారు. వివరాలు.. వేదాయపాళెంలోని కేశవులునగర్‌లో నివాసం ఉంటున్న సుజాత ప్రైవేట్ సంస్థలో మార్కెటింగ్ విభాగంలో పనిచేస్తున్నారు. ఈ నెల 14న తన కుమార్తెతో కలిసి చెన్నైలోని బంధువుల ఇంటికెళ్లారు. అదే రోజు సాయంత్రం కుమారుడు సైతం వెళ్లారు. ఈ క్రమంలో ఇంటి తాళాలు పగలగొట్టి ఉండటాన్ని పని మనిషి గౌసీ బుధవారం గమనించారు. ఇంట్లోని వస్తువులు చిందరవందరగా పడి ఉండటంతో విషయాన్ని యజమానురాలికి ఫోన్లో తెలియజేశారు. దీంతో సుజాత నెల్లూరు చేరుకున్నారు. బీరువాను పరిశీలించగా బంగారు ఆభరణాలు.. నగదు కనిపించకపోవడంతో వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో బాధితురాలు మరోమారు నిశితంగా పరిశీలించగా, చోరీకి గురయ్యాయని భావించిన వస్తువులు కనిపించాయి. దీంతో తన ఫిర్యాదుపై చర్యలొద్దని పోలీసులకు విజ్ఞప్తి చేశారు.

### రాపూరు సీఐగా కోటేశ్వరరావు

**నెల్లూరు(క్రైమ్):** నెల్లూరు డీటీసీ సీఐ కోటేశ్వరరావును రాపూరు సీఐగా నియమిస్తూ గుంటూరు రేంజ్ డీఐజీ త్రివిక్రమవర్మ ఉత్తర్వులను జారీ చేశారు. 2002 బ్యాచ్‌కు చెందిన కోటేశ్వరరావు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఎస్సైగా గతంలో విధులు నిర్వర్తించారు.